క్లుప్తంగా

విశ్వకర్మ పూజలకు ఆహ్వానం



రోహిత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

తాండూరు రూరల్: విశ్వకర్మ పూజకు తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు ఆహ్వానించారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో కలిసిన సంఘం నాయకులు బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసేందుకు అవకాశం రావడంపట్ల ఆయనకు అభినందనలు తెలిపారు. ఖాంజాపూర్ సమీపంలోని బ్రహ్మంగారి గుట్ట వద్ద సెప్టెంబర్ 17న నిర్వహించనున్న పూజలకు తప్పక హాజరవ్వాలని కోరారు. అనంతరం టీటీడీ బోర్డు సభ్యురాలు సీతారంజిత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



నెహ్రూనాయక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: రెండు రోజుల క్రితం జరిగిన బీఆర్‌ఎస్ జనసభ, ర్యాలీ నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన పార్టీ మండల ఉపాధ్యక్షుడు, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు నెహ్రూనాయక్‌ను ఆదివారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పరామర్శించారు. ఉపాధి కింద మీసేవా కేంద్రం, గృహలక్ష్మి పథకంలో ఇల్లు, వైద్యఖర్చులు, మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట నాయకులు దేశ్యానాయక్, నారాయణరెడ్డి, యాదగిరి, శ్రావణ్, సుదర్శన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నరేశ్‌గౌడ్ తదితరులున్నారు.

సేవా కార్యక్రమాలతో ప్రశాంతత

మర్పల్లి జెడ్పీటీసీ సభ్యుడు మధూకర్



విరాళం అందజేస్తున్న మధూకర్

మర్పల్లి: సామాజిక సేవా కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మర్పల్లి జెడ్పీటీసీ సభ్యుడు పబ్బే మధూకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామంలో స్వచ్ఛందంగా నిర్మించుకుంటున్న చర్చి నిర్మాణానికి ఆయన రూ.50వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. భవిష్యత్‌లోనూ తమ సహకారం ఉంటుందన్నారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ అశోక్, చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, శివరాం, జయకుమార్, అశోక్ తదితరులున్నారు.

ఓటు హక్కుకోసం నమోదు చేసుకోవాలి

ఎంపీటీసీ సభ్యుడు ఆనందం



ఓటుహక్కు నమోదు చేయిస్తున్న నాయకులు

కుల్కచర్ల: వయోజనులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్(బాలుర)లో నూతనంగా ఓటు హక్కుకోసం వయోజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది వెంకటయ్య, కృష్ణయ్య, పద్మ, సునీత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసమే పోరాటం

ప్లీనరీకు వెళ్లిన మున్నూరు కాపులు

కొడంగల్: నియోజకవర్గంలోని మున్నూరు కాపులమంతా ఆత్మగౌరవంతో బతుకుతున్నామని మున్నూరు కాపు సంఘం నాయకులు అన్నారు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఆదివారం నిర్వహించిన మున్నూరు కాపుల ప్లీనరీకు కొడంగల్ మున్నూరు కాపు సంఘం నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా బాకారం చంద్రశేఖర్, అరిగె అనంత ప్రసాద్, అరిగె ఓం, సిరుసని శ్యాంసుందర్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి తాము ఏమీ ఆశించలేదన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారని అన్నారు. ప్రభుత్వమే దిగి వచ్చి మున్నూరు కాపుల ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్నూరు బిచ్చప్ప, కానుకుర్తి నర్సిరెడ్డి, బొంకురు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

రామేశ్వరుడికి పుష్పార్చన

శ్రావణమాసం సందర్భంగా వికారాబాద్ పట్టణానికి సమీపంలోని బుగ్గ రామేశ్వర ఆలయంలో ఆదివారం పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పుష్పార్చనకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. – అనంతగిరి



బుగ్గలో శివలింగానికి పుష్పార్చన చేస్తున్న భక్తులు

నిధుల విడుదలలో జాప్యం

- ఇబ్బంది పడుతున్న సర్పంచ్‌లు
- నత్తనడకన సాగుతున్న పంచాయతీ భవన నిర్మాణాలు



గోట్లపల్లి పంచాయతీ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దేముల్: నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని పెద్దేముల్ ఎంపీడీఓ లక్ష్మప్ప అన్నారు. మండల పరిధిలో గోట్లపల్లి, కందనెల్లితండా, నాగులపల్లితో పాటు పలు గ్రామాలకు ప్రభుత్వం నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున ఎస్‌ఆర్ ఈజీఎస్ నిధులు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సూచిస్తున్నారు.

ఐదు పంచాయతీల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

మండల పరిధిలో 37 గ్రామ పంచాయతీలుండగా ప్రభుత్వం మరో ఐదు నూతన పంచాయతీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో మొత్తం 42 పంచాయతీలు కానున్నాయి. జనాభా ప్రాతిపదికన అందుకు తగిన వసతులు ఏర్పాటు చేయాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు. పలు గ్రామాల్లో వసతులు లేక పాలన ఇబ్బందిగా మారుతోందని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.

బిల్లులు రాక ఆగం...

పంచాయతీల అభివృద్ధికి చేపట్టిన పనులకు ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలు గ్రామాల సర్పంచ్‌లు వాపోతున్నారు. చేసిన పనులకు బిల్లులు రాక అప్పులపాలవుతున్నామని వాపోతున్నారు. రైతు వేదికలు, క్రీడాప్రాంగణాలు, సీసీ రోడ్లు తదితర పనులకు నేటికీ నిధులు రాకపోవడంతో వడ్డీల భారం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు వస్తేనే పనులు



గ్రామ పంచాయతీ భవనానికి ప్రభుత్వం రూ.20లక్షల నిధులు మంజూరు చేసింది. 90శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు కేవలం రూ.8.72లక్షల నిధులు మాత్రమే విడుదల చేసింది. ఇప్పటికే అప్పులు చేసి నిర్మాణం చేపట్టాం. మిగిలిన పనులకు అప్పు పుట్టడం లేదు. బిల్లులు మంజూరైతేనే పనులు పూర్తి చేస్తాం. – మట్ట భాగ్యమ్మ, సర్పంచ్, నాగులపల్లి

ఆందోళన అవసరం లేదు



ప్రభుత్వం పనులు చేసిన వెంటనే నిధులను ఖాతాల్లో జమచేస్తోంది. కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపడుతోంది. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు వస్తాయి. ఆందోళన అవసరం లేదు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలి. – లక్ష్మప్ప, ఎంపీడీఓ, పెద్దేముల్

మృతుడి కుటుంబానికి మిత్రుల అండ



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

కుల్కచర్ల: తమ స్నేహితుడి అకాల మరణాన్ని జీర్ణించుకోలేని స్నేహితులు తన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలని తలచారు. మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన కాంగారి రవి(బొంబాయి రవి) మూడు నెలలక్రితం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందాడు. కాగా కుల్కచర్ల శ్రీరామలింగేశ్వర డిగ్రీ కళాశాల రవితో పాటు చదివిన విద్యార్థులు రూ.లక్ష సేకరించి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

సీపీఎస్ రద్దుకు సంఘటితమవుదాం

టీఎస్ సీపీఎస్ ఈఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్



నూతన కార్యవర్గ సభ్యులతో అనిల్

కొడంగల్ రూరల్ : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించేవరకు ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయులు సంఘటితంగా పోరాడాలని టీఎస్ సీపీఎస్ ఈఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని అక్షర హైస్కూల్‌లో సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ అనిల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానం అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడిగా క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా దినేష్‌సింగ్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా సేవ్యానాయక్, గోపాల్, జిల్లా అసోషియేట్ అధ్యక్షులుగా అశోక్, ఐసాక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద్‌రావు, జైపాల్‌నాయక్, కరుణాకర్, రఘు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రభుత్వ విద్యార్థుల సత్తా



ప్రథమ బహుమతి అందుకుంటున్న నంబర్‌వన్ పాఠశాల విద్యార్థులు

తాండూరు టౌన్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని గీతా సత్సంగ్ సమితి, ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల విద్యార్థులకు పురాణ, ఇతిహాసాలపై స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 30 ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలల విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో ప్రభుత్వ నంబర్–1 పాఠశాల జట్టు, ద్వితీయ స్థానంలో టీఎస్ బాలికల గురుకుల పాఠశాల, తృతీయ స్థానంలో ప్రభుత్వ నెంబర్–2 పాఠశాల జట్టు నిలిచింది. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అభివృద్ధే మా ఎజెండా



అల్మాస్‌గూడలో అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి
- రూ.12.38 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: అభివృద్ధే మా అజెండాగా ముందుకు సాగుతున్నామని ఇది ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో రూ.12.38 కోట్ల నిధులతో (జనరల్ ఫండ్, హెచ్ఎండీఏ) 1,2,3,4,5,22,24,26,30 డివిజన్లలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను ముఖ్యఅతిథిగా సబితారెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఇందులో మంచినీటి పైప్‌లైన్, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీహాళ్లు, ఇతర మౌలిక వసతులున్నాయి. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే సీఎం కేసీఆర్ మహేశ్వరం అభివృద్ధికి రూ.150 కోట్లు మంజూరు చేశాడని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళ్లల అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నామన్నారు. వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుంటే ఓర్చుకోలేని ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఎన్ని ట్రిక్కులు ప్లే చేసిన ప్రజలు నమ్మేస్థితిలో లేరన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుతుందని ప్రజలు బలంగా విశ్వశిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హాట్రిక్ సాధించబోతున్నారని మహేశ్వరం గడ్డపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేసేలా ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రంశేఖర్, కార్పొరేటర్లు కవిత, స్వప్న, రాంరెడ్డి, దీపిక, లలిత, మమత, పి.శ్రీనివాస్‌రెడ్డి, స్వప్న, పద్మ, ఆర్.మాధురి, కమిషనర్ సుమన్‌రావు, ఫ్లోర్ లీడర్ అర్జున్, నాయకులు ఆనంద్‌రెడ్డి, బి.జంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, కృష్ణ, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

యువకుడికి నివాళి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడకు చెందిన యువకుడు కీసరి మహేష్‌రెడ్డి శనివారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సబితారెడ్డి పార్థివ దేహానికి ఆదివారం నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట కార్పొరేటర్‌రోహిణి రమేష్, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కుర్మల్‌గూడ వాసులు ఉన్నారు.

ఆదిలోనే ఆటంకం

దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వకుండానే 'గృహలక్ష్మి'విచారణ

ధారూరు: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నవారికి సమాచారం ఇవ్వకుండా విచారణ చేపట్టడం సరికాదని రాంపూర్ తండా సర్పంచ్ పాండునాయక్ ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పొలం పనులకు వెళ్లిన తర్వాత దరఖాస్తులు తీసుకుని వచ్చి విచారణ చేయడం సరికాదన్నారు. విచారణ చేపట్టకున్నా చేసినట్లు రికార్డుల్లో పొందుపరుస్తాన్నరని ఆరోపించారు. తాము అభ్యంతరం చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దరఖాస్తుదారుల సమక్షంలోనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

వినాయక ఉత్సవ కమిటీ

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హస్నాబాద్ శ్రీమహా వినాయక ఉత్సవ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా సర్పంచు పకీరప్ప, అధ్యక్షుడిగా కొత్త హన్మంతు(విశ్రాంత ఎస్టీఓ), ఉపాధ్యక్షులుగా సి.చిన్న వెంకటయ్య, కార్యదర్శిగా బీకే గొల్ల కృష్ణ, సహాయ కార్యదర్శిగా కె.సురేందర్‌గౌడ్, కోశాధికారిగా కె.నర్సన్‌గౌడ్, సహాయ కోశాధికారిగా పి.వెంకటేశ్, సాంస్కృతిక కార్యదర్శులు, డెకరేషన్ కమిటీ, భజన మండలి కమిటీ, ఊరేగింపు కమిటీ, సలహాదారులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బొక్కల కంపెనీలో మళ్లీ పనులు

గ్రామస్తులు ఆందోళన



కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

యాచారం: మండలంలోని కొత్తపల్లిలో ఉన్న బొక్కల కంపెనీలో శనివారం రాత్రి పనులు చేశారు. బొక్కల కంపెనీ వల్ల తీవ్ర దుర్వాసన వస్తుండడంతో కొన్ని నెలల కింద గ్రామస్తులు తీవ్ర ఆందోళనలు చేయడంతో అధికారులు కంపెనీని మూసేశారు. మళ్లీ శనివారం రాత్రి బొక్కల కంపెనీ నడిచినట్లు గ్రామస్తులు గుర్తించి ఆదివారం ఉదయం కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రామ ఉప సర్పంచ్ కావలి జగన్, బీఆర్‌ఎస్ నాయకులు లోహిత్‌రెడ్డి తదితరులు కంపెనీ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. సీఐ సైదయ్యకు ఫోను చేసి ఫిర్యాదు చేశారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ గోపాల్ కంపెనీ వద్దకు చేరుకుని కంపెనీ యజమానులతో మాట్లాడారు. అధికారులు మూసేసిన తర్వాత మళ్లీ పనులు చేయడం సరైంది కాదని ఎస్ఐ గోపాల్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు, కంపెనీ ప్రతినిధులు కూడా కంపెనీని మూసేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

పరిశ్రమలో ప్రమాదం.. కార్మికుడి మృతి

నందిగామ: పరిశ్రమలోని రేకులకు మరమ్మతులు చేస్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని నర్సప్పగూడ శివారులోని మహాలక్ష్మి స్టీల్ పరిశ్రమలో హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాన్(40) మూడు రోజుల క్రితం రేకులకు మరమ్మతులు చేసేందుకు పనిలో చేరాడు. శనివారం పనులు చేస్తుండగా ప్రమాదవశత్తు కిందపడి తీవ్రగాయాల పాలైయ్యాడు. దీంతో పరిశ్రమ సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ.. ఆదివారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. కాగా, మృతుడి సోదరుడు సయ్యద్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అనర్హులకే 'దళితబంధు'

ఆందోళన వ్యక్తం చేసిన మోమిన్‌ఖుర్దు దళితులు

ధారూరు: దళితబంధు పథకం అర్హులకు ఇవ్వకుండా అనర్హులకే కేటాయిస్తున్నారని మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు దళితులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో పేద దళితులకు వదిలేసి సొంతిల్లు, వ్యవసాయ భూములుండి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారికే మంజూరు చేస్తున్నారని మొగులయ్య, శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు విచారణ చేపట్టి అనర్హులను తొలగించి అర్హులకు చోటు కల్పించాలని కోరారు.

ఏబీజీఎస్‌వైవీ జిల్లా అధ్యక్షుడిగా ఆర్‌జే నాయక్

అనంతగిరి: అఖిల భారత గిరిజన సమాఖ్య యువజన విభాగం(ఏబీజీఎస్‌వైవీ) జిల్లా అధ్యక్షుడిగా ఆర్‌జే నాయక్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో జిల్లా యువజన విద్యార్థి విభాగాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్ జిల్లా నూతన కమిటీ నియామక పత్రాలు అందజేశారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, సభ్యులుగా మౌనిక, ప్రియాంక, రమేశ్, ప్రవీణ్, శ్రీను ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం

- చేవెళ్ల ప్రజాగర్జన సభ సక్సెస్‌తో జోష్
- ఆశావహుల్లో హుషారు



చేవెళ్ల ప్రజాగర్జన సభకు తరలిన జనం(ఫైల్)

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ప్రజాగర్జన సభ కొత్త జోష్‌ను నింపింది. చేవెళ్లలో నిర్వహించిన సభ సక్సెస్ కావడంతో క్యాడర్ ఉత్సాహంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో చేవెళ్లలో ప్రభంజనం సృష్టించేందుకు ఉవ్విల్లురూతున్నారు. అనుకున్నదానికంటే ఎక్కువ జనం రావడంతో పార్టీ నేతలు సైతం అధికారం తమదేనని భావిస్తున్నారు. గతకొన్ని ఏళ్లుగా చేవెళ్ల కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంది. ప్రజాగర్జన సభతో చేవెళ్లలో పార్టీకి పూర్వ వైభవం రానుందనే చర్చ మొదలైంది. అయితే, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల టికెట్ ఎవరికిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఆశావహుల్లో హుషారు..

నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నవారిలో ప్రజాగర్జన సభ సక్సెస్ కావడం కొత్త ఉత్సాహన్ని నింపింది. చేవెళ్లలో గెలుపు ఖాయమనే ధీమా పార్టీ నాయకుల్లో వచ్చింది. టికెట్ ఆశిస్తున్న స్థానిక నాయకులు మొయినాబాద్‌కు చెందిన షాబాద్ దర్శన్, చేవెళ్లకు చెందిన సున్నపు వసంతం, షాబాద్‌కు చెందిన పామెన బీంభరత్‌లకు ప్రజాగర్జన సభలో మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో ఆ ముగ్గురు నేతల్లో హుషారు పెరిగింది. సభ విజయవంతం కావడంతో ముగ్గురు నేతలు ఎవరికి వారే పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

స్థానికులకే టికెట్ దక్కేనా?

కాంగ్రెస్ పార్టీ టికెట్ స్థానిక నాయకులకే దక్కుతుందా.. వలస నాయకులు హస్తగతం చేసుకుంటారా? అనే చర్చ నియోజకవర్గంలో జోరుగా నడుస్తోంది. గత కొంతకాలంగా షాబాద్ దర్శన్, సున్నపు వసంతం, పామెన బీంభరత్‌లు స్థానికులకు టికెట్ ఇవ్వాలంటూ తమ వాణిని వినిపిస్తున్నారు. శంషాబాద్‌కు చెందిన రాచమల్ల సిద్దేశ్వర్ సైతం చేవెళ్ల టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. గత కొంత కాలంగా నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరో వైపు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి చంద్రశేఖర్ చేవెళ్ల నుంచి పోటీ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. కాంగ్రెస్ అధిష్టానం చేవెళ్ల టికెట్‌పై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. టికెట్ ఆశిస్తున్న నాయకులకు మీ పని మీరు చేసుకోండి అంటూ అధిష్టానం సూచించినట్లు తెలుస్తుంది. ప్రజాగర్జన సభతో ఫుల్ జోష్‌లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల టికెట్ ఎవరికి ఇస్తుందో వేచిచూడాలి.

ప్రతి ఒక్కరికి ధన్యావాదాలు

ప్రజాగర్జన సభ విజయవంతం కావడంతో చేవెళ్ల నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యావాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వెంట ప్రజలు ఉన్నారని ఈ సభ ద్వారా నిరూపితమైందని చెప్పారు. ఈ సభకు వచ్చిన జనాన్ని చూసి బీఆర్‌ఎస్ పార్టీకి గుబులు మొదలైదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్‌పార్టీ నిలబెట్టుకుంటుందని చెప్పారు. బలహీన వర్గాలకు అండగా నిలబడే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.6లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తే ప్రజలను రోడ్డుమీద పడేస్తారని ఆరోపించారు.